# మనసు

"చూస్తారేంరా, తన్నండి. కన్ను మిన్ను గానకుండా బలిసి అడ్డమయిన తిరుగుళ్ళు తిరుగుతుంటే, మూతిమీద మీసం పెట్టుకుని ఎలా ఊరుకుంటార్రా"- ఓ గొంతు.

"ఎయ్యరెసెయ్యి, ఒళ్ళంతా చితుక కొడితేగాని రోగం కుదరదు"- మరోగొంతు.

"అట్లాకొడితే సిగ్గొస్తదట్రా దానికి? పిగ, ముక్కు రెండూ కోస్తే బ్రతికున్నన్నాళ్ళు కుమిలి చస్తుంది"- ఇంకో ముసలిగొంతు.

"అయినా పురుగు పట్రా తిని పుట్టలుండమంటే ఊరు సుద్దులన్నీ నా పాలే అన్నట్లు, ఆదు కూకోబెట్టి మేపుతుంటే తిన్నదరగక, మస్తెక్కి ఊరెగ్గొట్టుంటుంది మరి!"- ఎడంచేతిని నడుం

కానించి, కుడిచేతిని అటూ ఇటూ తిప్పుతూ అంది ఓ నడి వయస్కురాలు.

"అయినా ఈ కాలమే యిట్లొస్తుందర్రా! మరి ఉండడానికో పోవడానికో కాని, గింత గింతోళ్ళకు ఎంతోయిది. అయినా పాపం పెరిగిపోతుంది. అందుకే అనల్లేవు; పంటల్లేవు" మరో ముసలమ్మ

పల్లెలోని ముత్యాలమ్మ గుడిముందరి వేపచెట్టు క్రింద గుమి కూడిల రక రకాల వ్యక్తులు రక రకాలుగా అంటున్నారు. గోళ్లు గిల్లుకుంటూ సిగ్గు, అభిమానం ఆవిరైపోగా, పాలిపోయిన ముఖంలో భయం కనిపిస్తూంటే తల వంచుకొని నిల్చుంది లచ్చిమి.

"వాడేడిరా... ... వాణ్ణి వదలి పెట్టారేం? వాణ్ణి గుంజుకరండి. మొదట వానొళ్ళు మెదగాలి"

"అవునసే! ఎక్కలిరగ తంతేగాని తిక్క తిరగదు" అంతలో రెక్కలు వెనుక్కు కట్టి వుంచబడ్డ నర్శిగాణ్ని ఇద్దరు నెట్టుకొచ్చి గుంపు మధ్యన నిలబెట్టారు. ముఖాన రక్తంచుక్క లేదు. తప్పు చేసిన తనం ప్రతి కదలికలో కనిపిస్తోంది.

తలవంచుకుని నిలబడ్డ నర్శిగాని ఎదురుగాపోయిన ఓ నడి వయస్కుడు తుపుక్కున ఊసి, "దున్నపోతులా బలిస్తే - ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో ఎలా తెలుస్తుందిరా? ఒంగబెట్టి బండరెత్తితేగాని నీ మస్త నగదు"

"కాదు కాదు. సువ్వగాల్చి ఇద్దరికి ఒళ్ళెలుపునా వాతలు గుంజితేగాని - వాళ్లు చేసిన పనికి అదే తగిన చిగిచ్చ"

"ఓరి ముదనష్టపు ముండాకొడుకా! నీకేం పోయేకాలమొచ్చిందిరా! పంఠంటి సంసారాన్ని పాడు చేసినావు. నీకు అక్క, చెల్లెళ్లు,

లేరటరా!" అంది ఓ. అవ్వ ముక్కుమీద కుడిచేతి చూపుడు వ్రేలు ఆనిస్తూ.

ఒకడు నర్శిగాడిని చెంపమీద కొట్టాడు.

మరొకడు తుపుక్కున వూసాడు.

ఇంకొకడు పళ్ళు కొరికాడు.

వేరొకడు కళ్ళెర్రజేసి చూశాడు.

ఒక్కొక్క మనిషి ఒక్కొక్క మాటంటుంటే, కొరడాతో కొట్టినట్టుంది నర్శిగాడికి. వలలో చిక్కిన పావురంలా లచ్చిమి, బోనులోపడ్డ పులిలా నర్శిగాడు ఇద్దరూ తలవంచుకుని నిలుచున్నారు. పెద్దమనుషులు వారిని ఏమేమో అడుగుతూ, తీర్పు చెప్పాలా లేక పంచాయితీ బోర్డులో పెట్టాలా అన్న ఆలోచనలో బడి యింకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు.

"అయ్యో! మనం చూడంగా దాన్ని ఏం చిన్నచూపు చూశాడని! తిండికి సంపిండా! బట్టకు సంపిండా! అసలెందుకీ పని చేసినట్టు?"

"ఆడింకెవతినన్నా మరిగిండేమో!"

"ఛీ! ఛీ! అట్లాంటివాడు కాదే వాడు! ఆసికా చితిలాకి బుద్దులు లేనే లేవు"

"మరెందు కిదీ పనిచేసినట్లు?"

"అయినా చేసేవాండ్లందరూ ఎందుకీ పని చేస్తుంట్రన్న సంగతి తెలిస్తే ఈ రంకు రంగే వెలిసేది"

ఇంతలో గుంపులో గుస గుసలు బయలుదేరాయి. బస్సు దిగిన మల్లయ్య చేతిలో ఆ రోజు దినపత్రికను పట్టుకొని గుంపువైపు

వస్తున్నాడు. చెట్టుక్రింద కూడిన మందిని చూడగానే మల్లయ్య మనస్సులో ఆలోచనలు ముసిరినవి.

"ఏమయ్యుంటుందబ్బా! ఇంత జనం ఎందుకు కూడారు. ఏదో కొట్లాట జరిగుంటుంది"

భుజంమీద సిల్కు కండువా అంచును పండ్ల మధ్యన కరచి పట్టి తదేకంగా గుంపువైపు చూస్తూ వస్తున్నాడు.

మల్లయ్యది ఎత్తైయిన విగ్రహం. బలిష్టమైన శరీరం. కష్టం చేసుకొని సంపాదించి, సుఖం పొందాలంటాడు. మంచీ, చెడూ తెలిసిన మనిషి కాబట్టే అప్పుడప్పుడు పెద్దమనుష్యులకు సైతం బుద్ధి చెబుతుంటాడు.

"మల్లయ్య కెరుకలేనట్లుంది" ఒకావిడ

"అవును పాపం! ఏంచేస్తాదో ఏమో!" మరోకావిడ

"కొంపతీసి కొట్టి చంపుతాడేమో, వీళ్ళని తప్పదీస్తే" ఇంకొకావిడు

మల్లయ్య గుంపును సమీపిస్తున్నాడు. గుంపు మల్లయ్య వైపు చూస్తున్నారు. మల్లయ్యను చూచిన లచ్చిమి ప్రాణం - దీపాని కంటుకున్న పురుగులా కొట్టుకుంటోంది. ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని, నీళ్ళు నిండిన కళ్ళతో అతనిని చూడలేక నేలను చూస్తోంది. శరీరమంతా చెమటతో నిండినా నోటిలో మాత్రం తడి లేని నర్శిగాడు మల్లయ్యను, అతని రాకను చూసే స్థితిలో లేడు.

గుంపును సమీపించిన మల్లయ్యకు ఎవరూ ఏమీ చెప్పలేదు. ఎవరినీ ఏమీ అడుగలేదతను. వెనక్కి చేతుల కట్టివుంచిన నర్శిగాణ్ణి, కొంత దూరంలో తలవొంచుకొని నిలబడ్డ లచ్చిమిని

చూడగానే మల్లయ్యకు ఎవరో తన గుండెలో బాకుతో పొడిచినట్లయింది. ఏదో సుడిగాలి అతనిని చుట్టినట్లయింది, ఎంతో వేగంతో పోయే వరదలో కొట్టుకుపోతున్నట్లయింది. మల్లయ్యకు కళ్ళముందు గతం కదలాడింది.

...కొత్తచీర కట్టుకున్న లచ్చిమి కాళ్ళకు మొక్కుతోంది.

...తిరనాళ్ళలో గాజులు, మెట్టెలు పెట్టుకున్న లచ్చిమి తన వైపు చూస్తూ యివి చల్లగుండే చాలంటోంది.

...దేవునికి దీపారాధన చేయిస్తే మన కడుపున ఓ కాయ కాయక పోతుందా అంటోంది.

...అర్ధరాత్రికాడ బావికాడికి పోతుంటే పురుగు, బూసి జాగ్రత్త అంటోంది.

...నేను నీకు, నాకు నీవు తప్ప లోకాన మన కింకేముందంటోంది.

అబ్బ! ఆ లచ్చిమేనా యీ లచ్చిమి? ఎంతపని చేసింది? రకరకాల ఆలోచనల్ని గుండెల్లో పెట్టుకొని, పొంగివచ్చే దుఃఖాన్ని అణచి పట్టుకున్నాడు మల్లయ్య. ఎంతో మంది వున్నా ఎవరూ లేనట్లుగా నిశ్శబ్దం ఆవరించింది చావడిని. భుజంమీది సిల్కు కండువా ఎడమ చేతిలో నలిగిపోతూంది. దినపత్రిక జారి క్రిందపడింది. మల్లయ్య మడిచి చీల్చుకొని కొద్ది దూరంలో ఉన్న తన యింటివైపు నడిచాడు. అందరూ అతనివైపే చూస్తున్నారు..

కొంతసేపటి తర్వాత లచ్చిమికి సంబంధించిన చీరలు, రవిక లన్నింటినీ మోపులా చేతపట్టుకొచ్చి రాతిబొమ్మలా నిలబడ్డ లచ్చిమిపైకి విసిరి, ఎవరి ముఖం చూడకుండా తలవంచుకొని

రోడ్డు వైపు నడిచాడు.

అంతవరకూ చూస్తూ ఊరుకున్న జనం...

"ఇది ఊరా పాడా!"

"నేనెంత మొనగాడో ననుకున్నా– చంపుతాడో, నరుకుతాడో ననుకున్నా"–

"అయినా వాడికే శరంలేనిది మనకేం బట్టిందిరా!"

"ఏరో ఎట్ల నో మాట్లాడుతవ్వూ– పసులకు పసులే కాస్తాయట్రా!"

"వాడు బుద్ధి చెప్పకపోయినా మనమన్నా ఏదో చిగిచ్చ చేయాలి. ఇట్లానే వదలిపెడితే, యియ్యాల యిది, రేపు యింకోటి– ఆ తర్వాత ఊరంతా పాడేకదా!"

"ఛీ రండాకొడుకు; పెళ్ళాం రంకుచేస్తే ఏంసక్కా– ఏమనకుండా వదలిపెట్టాడు"

–అంత వరకూ అన్నీ ఓపిగ్గా వింటూ వేపచెట్టు మొదలుకు ఆనుకు కూర్చున్న గోపన్న దారంతో కట్టుకున్న కళ్లద్దాలను సవరించుకుంటూ కర్ర సహాయంతో లేచి గుంపు మధ్యకొచ్చి–

"ఎవర్రా చిగిత్స చేసేది! మల్లిగాడు రండనా, మీరంతా మొనగాళ్ళా– మీకంటే వాడే నయం– ఎవరికి తెలియదురా మీ సంగతి?" అంటూ కుడిచేత్తో కర్రపట్టుకుని, ఎడమచేత్తో రొమ్మును చరుస్తుంటే అతుకుబడ్డ ఫ్రేంలో నుండి తెల్లని సీసపు గోళీలాంటి కనుగ్రుడ్లు ఉద్రేకాన్ని చిమ్ముతున్నాయి. ముడతలుబడ్డ మొఖం– మడతలలో ఎనబయి సంవత్సరాలు కనపడుతున్నవి.

ఒకని వైపు మళ్ళీ "నీవు రాసిని దోచలే!"

మరొకని వైపు మళ్ళీ "నీవు పెళ్ళిగాని పిల్లను పల్లెకు లేపుక

రాలే!"

మరొకని వైపు మళ్ళీ "కొండ్రెడు భూమికోసం నీవు నీ తోడ బుట్టిన అన్ననే చంపలే!"

ఇలాంటివన్నీ చిగిత్స కావలసిన తప్పులు కావా? అయినా మీరు తప్పుకుతిరుగుతూ- ఊళ్లో తప్పులను ఎంచుతున్నా రెందుకురా? ఇంతకీ మల్లయ్య ఏంతప్పు చేసిండని? ఏందో అది బలిసి అనెమ్మడిపోతే నీవెతుక్కున్న బాటన 'నీవే పొమ్మనడం తప్పా? నిజంగా చెప్పాలంటే వాడేరా మనిషి మీరంతా పెద్ద మొనగాండ్లయి వాడు చేసిన పనిని ఎగతాళి చేస్తున్నార్రా! సిగ్గు లేదురా మీకు? అయ్యా, నర్సయ్యా- యిక పోనాయనా, యీమెను నీవే ఉంచుకొని సంసారం చెయ్యి, ఏదో లేచిన ఘడియ మంచిదయింది. నీ అదృష్టం బాగుంది" అంటూ కర్ర సహాయంతో వెళ్ళిపోయాడు గోవన్న.

ఎవరూ ఎదురు మాట్లాడలేక గొణుక్కుంటూ కదిలిపోయారు.